నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 30 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి

- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్
- సీపీతో కలిసి కౌంటింగ్, స్ట్రాంగ్‌రూంల సందర్శన

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్ దత్

ఖమ్మం రూరల్, మార్చి 29 : లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం పొన్నెకల్ పరిధిలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి సందర్శించిన ఆయన స్ట్రాంగ్‌రూంలు, రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు సెగ్మెంట్లవారీగా స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ రూం ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూంకు కిటికీలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రత, పార్కింగ్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. వేసవి దృష్ట్యా విద్యుత్ ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పోస్టల్ బ్యాలెట్లకు గదులు సిద్ధం చేయాలన్నారు. 25 అగ్నిమాపక పరికరాలు ఉన్నందున స్ట్రాంగ్ రూంలకు అలారం ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ కేంద్రంలో రెయిన్ ప్రూఫ్ టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎం తరలింపు సిబ్బందికి సెగ్మెంట్లవారీగా కలర్ కోడ్‌తో కూడిన టీషర్టులు ఇవ్వాలన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శిక్షణకు సంబంధించి పీపీటీ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రైనీ ఐపీఎస్ పి.మౌనిక, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, ఎస్టీసీ రాజేశ్వరి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు

1, 2 తేదీల్లో తప్పనిసరిగా హాజరుకావాలి: భద్రాద్రి కలెక్టర్

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 29 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల విధుల కోసం ఎంపికైన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక తెలిపారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో జరిగే ఈ శిక్షణ తరగతులకు ఆ సిబ్బంది తప్పక హాజరుకావాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా సిబ్బందికి ఆయా కేంద్రాలను కేటాయించినట్లు చెప్పారు. భద్రాచలం నియోజకవర్గ సిబ్బందికి పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో, పినపాక నియోజకవర్గ సిబ్బందికి పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో, అశ్వారావుపేట నియోజకవర్గ సిబ్బందికి పాల్వంచలోని కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో, కొత్తగూడెం నియోజకవర్గ సిబ్బందికి స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో, ఇల్లందు నియోజకవర్గ సిబ్బందికి రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. శిక్షణ కేంద్రంలోనే పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్ 12లో విధిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్డర్ కాపీ, ఎపిక్ కార్డు జిరాక్సులతో హాజరుకావాలన్నారు. సిబ్బంది స్వీకరించిన ఫోన్ మెసేజ్‌లో ఏవైనా కరెక్షన్లు ఉంటే శిక్షణ కేంద్రంలో సంబంధిత అధికారులకు తెలియజేసి సరిచేసుకునే వీలు ఉందని అన్నారు. విధులు కేటాయించిన సిబ్బందికి ఆయా కేంద్రాల్లో ఉదయం 8:45 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని అన్నారు. నిర్ణీత సమయంలో హాజరుకావాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.

చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే శిక్ష తప్పదు

రౌడీషీటర్ల కౌన్సెలింగ్‌లో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న కొత్తగూడెం డీఎస్పీ

కొత్తగూడెం క్రైం, మార్చి 29: చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే వారికి కఠిన శిక్షలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కొత్తగూడెం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శుక్రవారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షలు కఠినంగా అమలు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా రౌడీషీటర్లు ఏదైనా నేర కార్యకలాపాల్లో పాల్గొన్నా, వివాదాల్లో తలదూర్చినా, అల్లర్లు సృష్టించినా, ప్రేరేపించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ పోలీసులను ఆదేశించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పసిగుడ్డు ఉసురు తీస్తున్నారు..

- ప్రైవేటు ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు
- గుట్టుచప్పుడు కాకుండా గర్భిణులకు అబార్షన్లు
- చేతిలో డబ్బు పెడితే చాలు.. ఇక 'భ్రూణ హత్యే..'
- పట్టింపులేని వైద్యారోగ్య శాఖ.. అరకొరగా దాడులు
- అంతంతమాత్రంగా చర్యలు.. తర్వాత షరా మామూలే..!



ఖమ్మం సిటీ, మార్చి 29 : కడుపులో ఎదుగుతున్న ఆడబిడ్డను పిండ దశలోనే చిదిమేస్తున్నారు. బాహ్య ప్రపంచానికి రాకముందే భ్రూణ హత్య చేస్తున్నారు. ఖమ్మం నగరంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాల అకృత్యాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. 'ఆడబిడ్డలు పుట్టి ఎందుకు..?' అనే అమానవీయ ఆలోచనతో కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి, యాజమాన్యం అడిగినంత సొమ్ము చేతిలో పెట్టి గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. భ్రూణ హత్యలకు తెగబడుతున్నారు. ఈ పనులన్నింటికీ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు ఎక్కడా పోస్టింగ్ దొరకని వైద్యులను కన్సల్టెంట్లుగా పెట్టుకుంటున్నట్లు, ల్యాబ్ నిర్వాహకులు కడుపులో పిండం ప్లస్ (మగ) లేదా మైనస్(ఆడ) అని.. ప్రత్యేక కోడ్ భాషలో గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు తెలుపుతున్నట్లు తెలుస్తున్నది. గర్భంలో పెరుగుతున్నది ఆడశిశువు అని తెలిస్తే ఇక అబార్షన్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

భ్రూణ హత్యలకు కేరాఫ్ ఖమ్మం..

వైద్యారోగ్య శాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే గర్భిణుల వివరాలను వైద్యులు, సిబ్బంది రికార్డుల్లో సమగ్రంగా పొందుపరచాలి. ప్రసవం జరిగినా, ముఖ్యంగా సి-సెక్షన్ ఆపరేషన్ అయితే అందుకు గల కారణాలను జిల్లా అధికారులకు నివేదించాలి. ఖమ్మంలో భ్రూణ హత్యలు, అబార్షన్లకు పాల్పడుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భిణులకు సంబంధించిన ఎలాంటి రికార్డులు ఉండవు. ఒక్కో అబార్షన్‌కు యాజమాన్యాలు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. గురువారం రాత్రి ట్రైనీ ఐఏఎస్ యువరాజ్, ట్రైనీ ఐపీఎస్ మౌనిక, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు నగరంలోని చర్చి రోడ్డులోని ఓ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్కడ ఒక్కచోటే దాదాపు 50 మంది గర్భిణులకు అబార్షన్లు చేయడాన్ని గుర్తించారు. వీరిలో ఐదుగురు మహిళల గర్భస్థ శిశువులను తొలగించడం గమనార్హం.

నిఘా వైఫల్య ఫలితమే..

వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రైవేటు ఆసుపత్రులపై అరకొర నిఘా వేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రి యాజమాన్యాలపై నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. 'దొరికితేనే దొంగ.. లేకపోతే దొర..' అన్న చందాన ఆసుపత్రి యాజమాన్యాల అక్రమాలు నడుస్తున్నాయి. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం చట్ట వ్యతిరేకంగా గర్భిణులకు అబార్షన్లు చేస్తుంటే వైద్యారోగ్య శాఖ చొరవతో పోలీసులు ఆ ఆసుపత్రి అధినేతను అరెస్ట్ చేశారు. కొంతకాలం తర్వాత సదరు నిందితుడు బయటకు వచ్చి తిరిగి అదే చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నాడు. ఇలాంటి తూతూమంత్రపు అరెస్టులు నగరంలో ఎన్నో జరుగుతున్నాయి. తిరిగి షరా మామూలే అన్నట్లుగా వైద్యులు అబార్షన్ల పబ్బం గడుపుకొంటూనే ఉన్నారు. నగరంలోని ఆసుపత్రులకు పొరుగు జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా గర్భిణులు వస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్రమ మార్గం పట్టిన వైద్యులు, సిబ్బంది భ్రూణ హత్యలు చేసి శిశువులను చిదిమేస్తుంటే, ఆ అమానుషాన్ని ఆపాల్సిన వైద్యారోగ్య శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో కలెక్టర్ ఖమ్మం వీపీ గౌతమ్, సీపీ సునీల్ దత్ చొరవ తీసుకుని భ్రూణ హత్యల నివారణపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వాములను చేసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నది. పట్టుబడిన ఆసుపత్రి అధినేతలపై హత్యానేరం మోపి కఠిన శిక్షలు విధిస్తే తప్ప పరిస్థితుల్లో మార్పు రాదనే ప్రజాభిప్రాయం వ్యక్తమవుతున్నది.

అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు..

గర్భస్థ లింగ నిర్ధారణ, సరైన కారణం లేకుండా అబార్షన్లు చట్టరీత్యా నేరం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెడతాం. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిపై వైద్యారోగ్య శాఖ నిఘా ఉంటుంది. నిబంధనలు అతిక్రమించి ఒక్కసారి పట్టుబడిన ఆసుపత్రి యాజమాన్యాలకు భవిష్యత్‌లో అనుమతులు ఇవ్వబోం. నిఘాకు అవసరమైతే పోలీసు శాఖను సమన్వయం చేసుకుంటున్నాం. నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించం. భ్రూణ హత్యల నివారణలో ప్రజలు, పార్టీలు, సంఘాల సహకారం అవసరం.

- బీ.మాలతి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, ఖమ్మం

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

- ఉమ్మడి జిల్లాలో విశ్వాసులతో కిక్కిరిసిన క్రైస్తవ మందిరాలు
- కళ్లకు కట్టినట్లుగా క్రీస్తు సిలువ మార్గం సన్నివేశాల ప్రదర్శనలు
- సిలువపై ప్రభువు పలికిన మాటల సందేశాలు స్మరించిన ఫాదర్లు
- దైవ మానవ ప్రేమను 'గుడ్‌ఫ్రైడే' చాటుతుందంటూ బోధనలు

ఖమ్మం: భటులు వెంట ఉండి క్రీస్తును సిలువ మోయిస్తున్న సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

ఖమ్మం/కొత్తగూడెం టౌన్, మార్చి 29 : క్రీస్తుకు సిలువ వేసే గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. లోక రక్షకుడైన క్రీస్తు.. సర్వ మానవపాప విముక్తి కోసం మరణ శిక్ష పొందిన రోజును శుభ శుక్రవారంగా పేర్కొంటూ క్రైస్తవ విశ్వాసులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు సిలువ మోసిన రోజును స్మరించారు. ఈ శుభ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో రెండు జిల్లాల్లోని అన్ని క్రైస్తవ మందిరాలూ కిక్కిరిశాయి. మానవులు చేసిన పాపాలను తను మోస్తూ సిలువపై ప్రాణాలను అర్పించి త్యాగాన్ని చాటిన ఏసును స్తోత్రాలతో కీర్తించారు. సిలువ ధ్యానాన్ని పాటించారు. భక్తితో 40 రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించిన విశ్వాసులు.. శుక్రవారం వాటి విరమణ చేశారు. సంప్రదాయం ప్రకారం పేదలకు దానం చేశారు. అనంతరం చర్చిలకు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖమ్మం ఆర్‌సీఎం చర్చి నుంచి నగర వీధుల్లో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు సిలువ మార్గ దృశ్యాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రభువు నడిచిన పరిశుద్ధ సిలువ మార్గంలోని 14 స్థలాల్లో ఏసు భరించిన కష్టాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రభువు సిలువ మోసిన నేపథ్యం, ఏసు బోధనలు, సందేశాలు, వాక్యాలను మత పెద్దలు వినిపించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభువు చూపిన మార్గాన్ని ఖమ్మం ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ బోధించారు. ఖమ్మం చర్చి కాంపౌండ్ సీఎస్ఐ చర్చిలో డోర్నకల్ బిషప్ పద్మారావు, రెవరెండ్ విశ్వంలు కూడా క్రీస్తు బోధనలు చాటారు. కరుణగిరి ఆర్‌సీఎంలో ఫాదర్‌లు గుడ్‌ఫ్రైడే ప్రాధాన్యాన్ని వివరించారు. కొత్తగూడెంలోని సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చిలో పాస్టరేట్ చైర్మన్.. క్రీస్తుకు సిలువ వేసే ఇతివృత్తాన్ని వివరించారు. ఈ పండుగ దేవుడికి మానవుడికి, మానవుడికి మానవుడికి గల ప్రేమ సంబంధాన్ని చాటుతుందని అన్నారు. జీవితంలో మానవులు పాపాలను చేయకుండా ఉండాలని, ప్రేమతో జీవించాలని, దేవుడి మార్గాన్ని ఎంచుకోవాలని ఉపదేశించారు. బైబిల్ వాక్యాలను పఠించారు.

పెనుబల్లి : సిలువను మోస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి చండ్రుగొండలో శిలువతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

శుభ శుక్రవారం సందర్భంగా కొత్తగూడెంలో సిలువలు మోస్తూ ప్రత్యేక ర్యాలీలు చేస్తున్న క్రైస్తవులు

ఖమ్మం: క్రీస్తుపై సిలువ పడిన సన్నివేశంలో భక్తుడు

పాల్వంచ: పట్టణంలో సిలువ మోస్తున్న క్రీస్తు వేషధారి

ఖమ్మం: ఏసును సిలువపై శిక్షించే సన్నివేశంలో విశ్వాసులు

పూర్తి సౌకర్యాలతో నిర్మాణాలు ఉండాలి

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్

భద్రాచలంలో భవన నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కమిషనర్ హన్మంతరావు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలం/పర్ణశాల, మార్చి 29 : భక్తులకు సరిపోయే విధంగా పూర్తి వసతి సౌకర్యాలతో భవన నిర్మాణాలు ఉండాలని దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ ఆదేశించారు. శుక్రవారం భద్రాచలం పర్యటనకు దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావుతో కలిసి వచ్చిన ఆమెకు బ్రిడ్జి పాయింట్ వద్ద కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఘన స్వాగతం పలికారు. అనంతరం భద్రాద్రి రామయ్య దర్శనానికి విచ్చేసిన వీరికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించారు. అంతకుముందు బ్రిడ్జి పాయింట్ పక్కన భక్తుల సౌకర్యార్థం భవనాలు నిర్మించే టూరిజంకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి నిర్మాణాలపై పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీరామ నవమి నిర్వహించే మిథిలా స్టేడియంను సందర్శించి.. స్వామివారి కల్యాణం వీక్షించే వీఐపీలు, భక్తులకు కల్పించే ఏర్పాట్ల గురించి దేవస్థానం ఈవోను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సులభంగా దర్శనం చేసుకునే విధంగా రోప్ మ్యాట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పర్ణశాలకు వెళ్లిన ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సీతారామయ్యను దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అధికారులు ఆలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యార్ మాట్లాడుతూ స్వామివారి చరిత్రను తెలిపే విధంగా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రత్యేకమైన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పర్ణశాలలో యాత్రికుల కోసం టూరిజం శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద పథకం కింద రూ.3.70 కోట్ల వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణాలను పరిశీలించారు. కరకట్ట నిర్మాణంలో భాగంగా డ్రైనేజీ వాటర్ వెళ్లే నిర్మాణ పనులు ఇక్కడే చేపడతామని సీతమ్మ బ్యారేజ్ అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, కలెక్టర్‌కు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, ఆర్డీవో దామోదర్‌రావు, టూరిజం శాఖ ఎస్ఈ సరిత, డీఈ రామకృష్ణ, సీతమ్మ బ్యారేజ్ డీఈ రాంబాబు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ముత్యాలరావు, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, పర్ణశాల ఆలయ ఫెస్టివల్ ఆఫీసర్ అనిల్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఎదుట కాంట్రాక్టు కార్మికుల ధర్నా

ధర్నా అనంతరం వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పాల్వంచ, మార్చి 29 : ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆస్పత్రి ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం నెలనెలా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పుడు కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ప్రతి నెల వేతనాలు వచ్చేలా చూడాలన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన వేతనాలు ఇవ్వకపోతే సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి అధికారులకు నోటీసు అందజేశారు. అనంతరం వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీకే ఎంయూ జిల్లా సహాయ కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, పద్మజ, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, పాషా, రామకృష్ణ, కనకదుర్గ, అజయ్, నాగలక్ష్మి, పద్మ, స్వరూప, జ్యోతి, రాము, దినేష్, గోపాల్, రామకృష్ణ, సుజాత, రుక్మిణి, హుస్సేన్, సత్యవతి, హేమంత్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్ కంపెనీకి కేటాయించొద్దు

రాష్ట్ర ఆయిపాం గ్రోయర్స్ అసోసియేషన్ డిమాండ్

సమావేశంలో చర్చిస్తున్న ఆయిల్‌పాం రైతు సంఘం నాయకులు

అశ్వారావుపేట, మార్చి 29 : ఆయిల్‌పాం సాగు అత్యధికంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాను ప్రైవేట్ కంపెనీకి కేటాయించొద్దని, అవసరమైతే ప్రైవేట్ కంపెనీ పరిధిలో ఉన్న మండలాలను ఆయిల్‌ఫెడ్ సంస్థ స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆయిపాం గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆలపాటి రామచంద్రప్రసాద్, కోటగిరి సీతారామస్వామి అన్నారు. నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించిన సంఘ బాధ్యులు ఆయిల్‌పాం రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కెట్‌లో ఆయిల్ విక్రయాల ఆధారంగా గెలల ధర నిర్ణయించడంలో అభ్యంతరం లేదని, పర్సంటేజీ ప్రకటన విషయంలో ఆయిల్‌పాం రైతు సంఘం డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. దీంతోటన్ను గెలల ధరలో స్వల్పంగా రేటు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పామాయిల్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంఘం విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు కోరారు. సమావేశంలో సంఘం బాధ్యులు జేకేవీ రమణారావు, బండి భాస్కర్, మొగళ్లపు చెన్నకేశవరావు, బుద్దే కోటేశ్వరరావు, కేదాసీ వెంకట సత్యనారాయణ, మురళి, మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, అంకతి మహేశ్వరరావు, దొడ్డా ప్రసాద్, యర్రా వసంతం తదితరులు పాల్గొన్నారు.